సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 14 । నవంబర్ । 2024



తలసేమియా చిన్నారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

'తలసేమియా చిన్నారులది సాధారణ జీవితం కాదు.. ఒడిదుడుకులను అధిగమిస్తూ ఉన్నత స్థాయికి చేరి కలలను నిజం చేసుకునేందుకు మేం అండగా నిలుస్తాం.' అని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. 'సాక్షి' మీడియా గ్రూప్, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన తలసేమియా చిన్నారుల సమక్షాన బుధవారం చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చిన్నారులతో సరదాగా గడిపారు. సాధారణ వ్యక్తిలా కింద కూర్చుని మాట్లాడి సమస్యలు, చికిత్స వివరాలు తెలుసుకోవడమే కాక భవిష్యత్‌పై దిశానిర్దేశం చేశారు. – ఖమ్మంమయూరిసెంటర్

మీ సంకల్పానికి అండగా ఉంటాం

- తలసేమియా చిన్నారులు ఎదిగేలా నిరంతర సహకారం
- స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయం
- ఇక్కడి డాక్టర్ల పనితీరుతో వైద్యరంగానికి గుర్తింపు
- మీడియా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం భేష్

'సాక్షి' మీడియా, సంకల్ప సంస్థ ఆధ్వర్యాన చిల్డ్రన్స్ డే వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఆనందంగా గడిపాం..



కలెక్టర్ మా వద్దకు వస్తున్నారంటే తొలుత ఆశ్చర్యమేసింది. కలెక్టర్ సార్ వచ్చి మాతో పాటే నేలపై కూర్చుని మమ్మల్ని పలకరించిన విధానం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సార్ ఉన్నంతసేపు ఆనందంగా గడిపాం. మమ్మల్ని ఉత్సాహపర్చడమే కాక మాలో ధైర్యాన్ని నింపారు.

– బి.సునీల్, చిన్నారి

మాకు గుర్తుండిపోయే రోజు..



బాలల దినోత్సవానికి విహార యాత్రలకు వెళ్లడం, మిత్రులతో సరదాగా గడిపేవాళ్లం. తొలిసారి 'సాక్షి' మీడియా గ్రూప్, మా సంస్థ నిర్వహించిన కార్యక్రమం అద్భుతంగా సాగింది. కలెక్టర్ సార్‌తో గంట సమయం గడిపిన ఈ రోజు మాకు జీవితంలో గుర్తుండిపోతుంది.

– ఎస్.శ్రీలక్ష్మి, విద్యార్థిని

బాధలన్నీ మర్చిపోయాం..



సొంత మనిషిలా మాతోపాటు నేలపై కూర్చుని కలెక్టర్ సార్ మాట్లాడడం ఆనందాన్ని ఇచ్చింది. ఫ్రీగా ఉండండి.. మీ సమస్యలు చెప్పండి.. నేనున్నా అంటూ సార్ మాట్లాడడం మా బాధ మరిచిపోయేలా చేసింది. సార్‌తో గడిపినంత సేపు మేమూ ఎదగాలనే ఆలోచన వచ్చింది.

– ఇ.మాన్విత, విద్యార్థిని



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్. పక్కన సాక్షి బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, డాక్టర్ నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పావని, అనిత తదితరులు

సమాజం తరఫున అభినందనలు

సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తలసేమియా చిన్నారులకు చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. చాలా మంది కష్టాలు అనుభవించినా.. పెద్ద ఆలోచన చేసే వారు తక్కువగా ఉంటారని తెలిపారు. మరొకరికి కష్టం కలగకుండా అవగాహన కల్పించడం సాధారణ విషయం కాదన్నారు. మంచి లక్ష్యంతో సంస్థను నిర్వహిస్తున్న బాధ్యులను సమాజం తరఫున అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇక వైద్యులు తలసేమియా చిన్నారులకు సేవలు అందించడం హర్షణీయమని.. ఇలాంటి వైద్యుల పనితీరుతోనే చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ధైర్యం కలుగుతుందని చెప్పారు.

మీడియా నాలుగో స్తంభం..

'సాక్షి' మీడియా గ్రూప్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడాన్ని కలెక్టర్ ప్రశంసించారు. మీడియాలో మంచి విలువలు కలిగిన జర్నలిస్టులు ఉన్నారని కొనియాడారు. ఎన్నికలు, కోవిడ్ వంటి క్లిష్ట సమయాల్లో సమాజానికి సమాచారం చేరవేయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా లేకపోతే సమాజం స్థిరంగా ఉండదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఈ నమ్మకం మరింత బలపడుతుందని తెలిపారు.



చిన్నారితో ఆడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

అద్భుత ఫలితాలు సాధించాలి..

తలసేమియా చిన్నారులతో మాట్లాడిన కలెక్టర్ వారికి ధైర్యంచెప్పారు. కష్టాలు వచ్చాయని ఆలోచించకుండా అవి తొలగిపోతాయనే నమ్మకంతో ముందుకు సాగాలన్నారు. అద్భుతమైన డాక్టర్లు చికిత్స చేస్తున్నందున శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. చిన్నారుల వెంట తల్లిదండ్రులే కాక సమాజం ఉన్నందున ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని తెలిపారు. అమెరికాలో కంపెనీ స్థాపించాలనే స్థాయిలో ఆలోచించాలని చెప్పారు. తప్పక అద్భుతమైన భవిష్యత్ ఉంటుందని భరోసా కల్పించారు.

కేక్ కట్ చేసి.. ఆటలాడి..

చిల్డ్రన్స్ డే సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన కలెక్టర్ వారితో ఆటలాడి ఉత్సాహపరిచారు. కలెక్టర్ తమతో గంటకు పైగా గడపగా చిన్నారులు సంతోషించారు. ఈకార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, డెస్క్ ఇన్‌చార్జి ప్రతాపురం శ్రీనివాస్, సాక్షి టీవీ ఇన్‌చార్జి పసునూరి మహేందర్, ఏడీవీటీ ఇన్‌చార్జి నామ నాగేశ్వు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజు, ఆర్సీ ఇన్‌చార్జి నెల్లూరి ఉపేందర్‌తో పాటు మాదినేని శ్రీనివాస్, జుజ్జూరి ఉపేందర్, గోపతి నాగేందర్, అన్నంచిన్ని వెంకట రామారావు, ఎం.డీ.హుస్సేన్, గద్దం సతీష్, కారుమంచి శ్రీను, జి.నరసింహారెడ్డి, శేషయ్య, పాషా, నందకుమార్, సంకల్ప సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి ఉదయ్‌భాస్కర్, రవిచందర్, వంశీకిరీటి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో మనో ధైర్యం..



కలెక్టర్ ఉన్నంతసేపు చిన్నారులు ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు. సార్ మాట్లాడుతున్నంత సేపు వారిలో కొత్త అనుభూతిని చూశా. ఇలాంటి కార్యక్రమాలతో మనోధైర్యం పెరుగుతుంది. ఇందుకు చొరవ చూపిన 'సాక్షి' మీడియా గ్రూప్ వారికి ధన్యవాదాలు.

– పి.అనిత, వ్యవస్థాపకురాలు, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ

సార్‌కు సమస్యలు చెప్పుకున్నాం..



బాలల దినోత్సవంలో మా చిన్నారులతో కలిసి కలెక్టర్ పాల్గొనడం సంతోషాన్ని కలిగించింది. తలసేమియా చిన్నారులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలను సార్‌కు విన్నవించుకునే అవకాశం దక్కింది. దీంతో చిన్నారులు, తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు.

– పి.పావని, సంస్థ ఉపాధ్యక్షురాలు

కలెక్టర్ రావడం చాలా సంతోషం



వేడుకలకు కలెక్టర్ రావడం సంతోషంగా ఉంది. తలసేమియా చిన్నారులకు జీఓ 5 అములు చేసే విషయాన్ని సార్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. మా ఆస్పత్రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు.

– డాక్టర్ నారాయణమూర్తి, రితన్య హాస్పటల్

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య కల్యాణం



ధ్వజస్తంభం వద్ద నమస్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు

భద్రాచలంటౌన్/భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏఓ రాంబాబు, ఏఈఓ శ్రవణ్ కుమార్, ఏసీఎంఓ రమణయ్య, డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, ఏటీడీఓ చంద్రమోహన్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

మ్యూజియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న పీఓ రాహుల్, సీఎండీ వరుణ్‌రెడ్డి

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో గల గిరిజన మ్యూజియంలో పలు అభివృద్ధి పనులకు పీఓ బి.రాహుల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. వచ్చే ముక్కోటి ఏకాదశి నాటికి మట్టి ఇల్లు, చేపల చెరువు, వంట షెడ్డు నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉత్తరద్వార దర్శనానికి వచ్చే భక్తులు మ్యూజియాన్ని తిలకించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వర్క్‌బుక్‌ల ముద్రణ, సరఫరాకు టెండర్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ప్రాథమిక ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకునేందుకు వర్క్‌బుక్‌లు పంపిణీ చేయాలని ఐటీడీఏ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యాల నుంచి టెండర్లు ఆహ్వానించగా ఐటీడీఏ కార్యాలయంలో పీఓ బి.రాహుల్ ఆధ్వర్యాన పరిశీలించారు. త్వరలోనే తక్కువ రేట్‌కు కోట్ చేసిన యజమానులకు టెండర్లు అప్పగిస్తామని తెలిపారు. మూడు నుంచి ఐదో తరగతి వరకు 5,611 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం వర్క్ బుక్‌లు సరఫరా చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, జీసీసీ డీఎం సమ్మయ్య, ఏటీడీఓ అశోక్ ఈఈ తానాజీ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ రోహిత్ రాజ్ సూచించారు. మండలంలోని గుంపెనలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చెప్పారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మహాలక్ష్మి, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎస్‌ఐలు గంజి స్వప్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- హత్య చేసి పత్తి చేనులో పూడ్చిపెట్టిన ప్రియుడు
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



మృతురాలు స్వాతితో వీరభద్రం (ఫైల్)

జూలూరుపాడు: సహజీవనం చేస్తున్న ఓ మహిళను ప్రియుడే దారుణంగా హత్య చేసి, మృతదేహాన్ని తన చేనులోనే పూడ్చిపెట్టిన ఘటన జూలూరుపాడు మండలం మాచినేనిపేటతండాలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన తోట స్వాతి(32)కి మణుగూరు మండలం తోగ్గూడేనికి చెందిన సాంబశివరావుతో వివాహం జరిగింది. నాలుగేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో స్వాతి కొత్తగూడెం చేరుకుని ఓ ప్రైవేట్ పాఠశాలలో వంట మనిషిగా చేరింది. మాచినేనిపేట తండాకు చెందిన బానోత్ వీరభద్రం కూడా అదే పాఠశాలలో పీఈటీగా చేరాడు. ఈ క్రమంలో స్వాతికి – వీరభద్రంకు మధ్య పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీయగా సహజీవనం చేస్తున్నారు. ఆ తర్వాత స్వాతి స్కూల్‌లో మానేసి ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తుండగా వీరభద్రం స్వగ్రామంలోనే వ్యాపారం చేస్తున్నాడు. స్వాతితో సహజీవనం సాగిస్తూనే రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలంగా అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం..

జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన హలావత్ రత్నకుమార్ సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తామంటూ వీరభద్రం – స్వాతి రూ.16 లక్షలు తీసుకున్నారు. కొన్నాళ్లు వేచి చూసినా ఉద్యోగం రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన రత్నకుమార్ – పార్వతి దంపతులు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో స్వాతి, వీరభద్రంపై చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా రత్నకుమార్ కుటుంబానికి రూ.8లక్షలు ఇస్తామని వీరిద్దరూ అంగీకరించినట్లు తెలిసింది. ఈ డబ్బు విషయంలో స్వాతి – వీరభద్రం మధ్య గొడవ జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈనెల 9వ తేదీ రాత్రి స్వాతిని తల్లి సరోజ సాయంతో వీరభద్రం హతమార్చి కొత్తగూడెం వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న తన పత్తి చేనులో గొయ్యి తీసి పూడ్చేశాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన ఓ రైతు మేకలు పోయాయంటూ వెదుకుతుండగా వీరభద్రం చేనువద్ద కనిపించడం, ఆయన ఇంటి వద్ద రక్తపు మరకలు ఉండడంతో అతడే స్వాతిని హత్య చేశాడని గ్రామంలో చర్చ జరిగింది. దీనికి తోడు రత్నకుమార్ దంపతుల ఆత్మహత్య కేసులో గత ఆదివారం వీరభద్రం ఒక్కడే చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యాడు. స్వాతి ఎందుకు రాలేదని పోలీసులు ప్రశ్నించగా.. ఆమె ఎటు వెళ్లిందో తనకు తెలియదని సమాధానం చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన జూలూరుపాడు పోలీసులు వీరభద్రంను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడని సమాచారం. కాగా, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్ చేను వద్దకు వెళ్లి బుధవారం స్వాతి మృతదేహాన్ని వెలికితీశారు. తహసీల్దార్ స్వాతి బిందు సమక్షంలో అక్కడే శవ పంచనామా చేశారు.

రామయ్యకు కిరీటం బహూకరణ

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యుల కుటుంబ సభ్యులు బుధవారం కిరీటాన్ని బహూకరించారు. వెండిపై బంగారు పూత పూసిన రూ.1,46,800 విలువైన తలపాగా కిరీటాన్ని ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం పెద్దమ్మతల్లి ఆలయంలో చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొన దలచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. హాజరయ్యే పురుషులు ధోతి, కుండువా, మహిళలు చీరలు ధరించి రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనో కమ్ టైపిస్ట్-1, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్-1, రికార్డ్ అసిస్టెంట్-1 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 22వ తేదీ లోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా కోర్టు కాంప్లెక్స్ చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా తమ దరఖాస్తులు పంపించాలని సూచించారు.

జీరో నుంచి హీరో !

- ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆ'గని' పయనం
- కూలీ నుంచి సింగరేణి సీఎండీగా ఎదిగిన బలరాంనాయక్



ఐఆర్ఎస్ శిక్షణలో...

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సంకల్పం గట్టిదైతే పంచ భూతాలు కూడా తోడుగా నిలుస్తాయనడానికి సింగరేణి సీఎండీ బలరాంనాయక్ జీవితం ఓ ఉదాహరణ. ఆర్థిక ఇబ్బందులు అడ్డుగా నిలిచినా, కుటుంబ బాధ్యతలు మీద పడినా కలలు కనడం ఆపలేదు. వాటిని సాకారం చేసుకునేందుకు కండలు కరిగించారు, మెదడును మథించారు. అందువల్లే ఆయన ప్రస్థానం జీరో నుంచి రియల్ హీరో స్థాయికి చేరింది. స్ఫూర్తిగా నిలిచే ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలు రేపటిపౌరుల కోసం..

అధికారిని చూసి ఆశ్చర్యపోయి..

మహబూబ్‌నగర్ జిల్లా తిరుమలగిరి మండలం బాలానగర్ తండాకు చెందిన నూనావత్ హన్యా, కేస్లీ దంపతులకు ఏడుగురు సంతానం కాగా, బలరాంనాయక్ పెద్దవాడు. ఆ కుటుంబానికి నాలుగెకరాల పొలం ఉన్నా నీటి వసతి లేక తిండి గింజలకు సరిపడా పంట కూడా వచ్చేది కాదు. దీంతో పిల్లలను గ్రామంలోనే వదిలేసి కూలీ పనుల కోసం తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడి ఉన్నా అక్షరాల వెంట పరుగులు తీయడంలో బాల్యం నుంచి బలరాం ముందుండే వాడు. ఎప్పుడైనా ఎమ్మార్వో (ప్రస్తుత తహసీల్దార్) వంటి అధికారులు తండాకు వస్తే వారికి దక్కే గౌరవం చూసి ఆశ్చర్యపోయేవాడు. తాను అలా కావాలనే కోరిక కలిగేది. కానీ కుటుంబ పరిస్థితులు అలా లేవు. దీంతో సెలవులు వస్తే భవన నిర్మాణ పనులకు వెళ్లి కూలీగా వచ్చిన రూ.25 దాచుకుని పుస్తకాలు కొనుక్కునేవాడు.

కలలకు రెక్కలు

బాగా చదివితే పెద్ద ఆఫీసర్ కావొచ్చని స్కూల్ టీచర్లు చెప్పిన మాటలు చెవుల్లో మోగుతున్నా కుటుంబ పరిస్థితుల కారణంగా ఇంటర్ కాగానే చదువు ఆపేసి శారదను పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగం కోసం ఆర్ఆర్‌బీ, ఆర్మీ, పోలీస్ ఇలా ఏ నోటిఫికేషన్ పడ్డా దరఖాస్తు చేస్తూ పరీక్షలు రాసేవారు. ఆ సమయంలో జిరాక్స్ పత్రాలపై సంతకాల కోసం గెజిటెడ్ అధికారుల వద్దకు వెళ్లినప్పుడు పెద్దాఫీసరు కావాలనే చిన్నప్పటి కోరిక మరోసారి ఊపిరి పోసుకుంది.

పనే దైవంగా..

కుటుంబ భారాన్ని మోస్తూనే చదువుపై దృష్టి సారించారు బలరాం. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదవాలని నిర్ణయించుకున్నారు.



సింగరేణి సీఎండీగా...

అప్పటికే ముగ్గురు పిల్లలు కావడంతో కుటుంబ పోషణ కోసం పీఎంఆర్‌వై స్కీం ద్వారా ఆటో తీసుకుని నడిపారు. చదువుకు సమయం వెచ్చించాల్సి వచ్చినపుడు ఆటో అద్దెకు ఇచ్చేవారు. ఆటో నడిపినప్పుడు గ్యాస్ సిలిండర్లను భుజాలపై మోస్తూ డెలివరీ చేశారు.

సివిల్సే లక్ష్యం..

డిగ్రీ పూర్తవగానే సివిల్స్ రాసేందుకు సిద్ధమయ్యారు. అప్పటి వరకు తెలుగు మీడియం, అదీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో చదువుకుని సివిల్స్‌కు సిద్ధమవడం కష్టమనే నిర్ణయానికి వచ్చా రు. అందుకోసం ప్రభుత్వం ఉచితంగా కోచింగ్ ఇచ్చే ఏపీ స్టడీ సర్కిల్‌లో చేరాలని వెళ్తే పీజీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. దీంతో డిస్టెన్స్‌లో పీజీ చదువుతూనే పార్ట్ టైం ఉద్యోగాలు చేసేవారు. ఎంత పెద్ద లక్ష్యమైనా చిన్న అడుగుతోనే మొదలనే మాటను నిజం చేస్తూ డిగ్రీ అర్హతగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వారు. ఈక్రమాన గ్రూప్ 1, 2 పరీక్షల్లో సానుకూల ఫలితాలొచ్చినా సివిల్స్ లక్ష్యాన్ని మర్చిపోలేదు.

ప్లాన్ ఆఫ్ యాక్షన్

పీజీ పూర్తి కాగానే స్టడీ సర్కిల్‌లో చేరారు బలరాంనాయక్. కోచింగ్ సమయంలో క్షణం వృథా చేయకుండా ఉదయం నుంచి రాత్రి రెండు గంటల వరకు, కనీసం ఇంటికి వెళ్లకుండా సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. దీంతో మొదటి ప్రయత్నంలోనే 2010లో సివిల్స్‌కు ఎంపికై ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌లో జాయిన్ అయ్యారు. తొలుత మేడ్చల్‌లో సెంట్రల్ కస్టమ్స్ డివిజన్ అధికారిగా, ఆ తర్వాత ముంబైలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేశారు. 2017లో సింగరేణిలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా చేరి, డైరెక్టర్(పా)గా సేవలు అందించి ప్రస్తుతం సింగరేణి సీఎండీగా కొనసాగుతున్నారు. ఒకప్పుడు ఖర్చుల కోసం కూలి పని చేసి రూ.25 సంపాదించిన వ్యక్తి నేడు రూ.40 వేల కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన కంపెనీకి బాస్‌గా అనేక మందికి స్ఫూర్తినిస్తున్నారు.

కలలు కన్నారు.. సాధించారు! 8లో
జిల్లా స్థాయి అధికారుల విజయగాథలు

పర్యాటకులకు ఆహ్లాదం కలిగించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

పాల్వంచరూరల్/చంద్రుగొండ/సూపర్‌బజార్(కొత్తగూడెం): పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా పనులు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జాతీయ పర్యాటకరంగ సభ్యురాలు కల్పన రమేష్ తదితరులతో కలిసి బుధవారం ఆయన కిన్నెరసానిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపం, భద్రాచలం, మణుగూరు వద్ద గోదావరి వద్ద వాటర్ ఫెస్టివల్ నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం బోటింగ్ చేశారు. ఆ తర్వాత ఎస్పీ రోహిత్‌రాజ్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సభ్యులు డాక్టర్ మధువరన్‌తో కలిసి ఐఎంఏ సభ్యులతో సమావేశమై మాట్లాడారు.

జిల్లాస్థాయి రోడ్డు భద్రత సమావేశం..

స్థానిక ఐడీఓసీలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని రహదారులపై ఉన్న గుంతలను ఈనెలాఖరులోగా పూడ్చివేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని డీఈఓకు సూచించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్, ఆర్‌టీఓ సదానందం, ఈఈలు వెంకటేశ్వరరావు, లాల్‌సింగ్, శ్రీనివాసరావు, తానాజీ, ఎన్‌హెచ్ అధికారి శైలజ, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

కనకగిరి అందాలు అద్భుతం

కనకగిరి గుట్టల అందాలు అద్భుతంగా ఉన్నాయని జాతీయ పర్యాటకరంగ సభ్యురాలు కల్పన రమేష్ అన్నారు. బెండాలపాడు శివారులోని గుట్టలను బుధవారం ఆమె సందర్శించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏపీఓ సంతోష్ కుమార్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కిన్నెరసానిలో బోటింగ్ చేస్తున్న కలెక్టర్ తదితరులు

కలలు కన్నారు.. సాధించారు!

అందరూ సాధారణ కుటుంబాల్లో జన్మించిన వారే. కొందరైతే కనీస వసతులు లేని పల్లెల్లో పుట్టినా చదువుపై మమకారం పెంచుకున్నారు. విద్యుత్ సౌకర్యం, తల్లిదండ్రులకు ఫీజులు కట్టే స్థోమత లేకున్నా కష్టాలకు ఎదురీదారు. విద్యార్థి దశలోనే ఉన్నత స్థానానికి చేరాలని నిర్ణయించుకున్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా తాము కన్న కలల తీరాన్ని చేరేందుకు శ్రమనే నమ్ముకున్నారు. దీంతో కష్టాలు, కన్నీళ్లు వారి ముందు తలొంచాయి. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జిల్లా స్థాయి అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు అధికారుల స్ఫూర్తిదాయక కథనాలు నేడు బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల కోసమే కాదు అందరి కోసం!

- కనీస సౌకర్యాలు లేని పల్లెల నుంచి వచ్చినా విరామమెరుగక పోరాటం
- కష్టాలకు ఎదురొడ్డి విజేతలుగా నిలిచిన పలువురు
- ప్రస్తుతం జిల్లా స్థాయి అధికారులుగా విధులు

కిరోసిన్ దీపం కింద కూర్చుని చదివా..


బాదావత్ లక్ష్మయ్య

పాల్వంచ: మాది ప్రస్తుత సూర్యాపేట జిల్లా మునగాల మండలం సీతారాంపురం తండా. అమ్మానాన్నలు తావుర్యా – సాజీకి మేం నలుగురు సంతానం. ఐదెకరాల భూమిలో పంటలు సాగుచేస్తూ నాన్న కుటుంబాన్ని పోషించేవారు. పెద్దకుమారుడిగా నేను అమ్మానాన్నతో వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. 1 నుంచి 7వ తరగతి వరకు తండా నుండి ఆరు కి.మీ. దూరాన రేపాలకు నడుచుకుంటూ వెళ్లి చదువుకున్నాక 8, 9, 10, ఇంటర్ సూర్యాపేట హాస్టల్‌లో ఉంటూ పూర్తిచేశా. హైదరాబాద్‌లో జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ పూర్తిచేశాక ఏపీఎస్‌ఈబీలో 1990లో ఏఈగా ఉద్యోగం వచ్చింది. మూడు నెలల శిక్షణ అనంతరం పాల్వంచ కేటీపీఎస్‌లో ఏఈగా చేరా. అయితే, ఇదంతా సాఫీగా ఏం జరగలేదు. చిన్నతనాన తండాలో కరెంట్ లేకపోగా కిరోసిన్ దీపాల కింద చదువుకున్నా. పదో తరగతి వరకు చెప్పులు కూడా లేవు. మునగాల మండలంలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన తొలివ్యక్తిని నేనే. ఇందుకు నాన్న ప్రోత్సాహమే కారణం. నాకు 1991లో డోర్నకల్‌కు చెందిన శాంతాబాయ్‌తో వివాహం జరగగా భార్గవి, దినేష్ కుమార్ సంతానం. ఏఈ నుంచి ఏడీఈ, డీఈ, ఎస్ఈ, సీఈ వరకు కేటీపీఎస్‌లోనే పదోన్నతులు పొందిన నేను శ్రీశైలం, కేటీపీఎస్, విద్యుత్ సౌధల్లో సీఈగా పనిచేశాక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందా. కేటీపీఎస్, వైటీపీఎస్, బీటీపీఎస్, కేటీపీపీ, ఆర్‌టీపీపీల్లో పనిచేస్తూ ఇప్పుడు డైరెక్టర్ స్థాయికి ఎదిగాను. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టాలు ఎదురైనా ముందుకు సాగితే మంచి ఫలితం వస్తుంది. తెలియని విషయాన్ని అడగడంలో బిడియపడొద్దు. నాకు సైతం విధుల్లో ఐదు శాతమే తెలుసు.. మిగతా 95శాతం సహచరుల సహకారంతో పనిచేస్తుండడంతో విజయాలు సొంతమయ్యాయి.

– బాదావత్ లక్ష్మయ్య, టీజీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్)

వార్డెన్ స్ఫూర్తిగా.. వార్డెన్లకు బాస్‌గా


చదువుకునే రోజుల్లో..



ప్రస్తుతం విధుల్లో..

కొత్తగూడెంరూరల్: పాల్వంచ హాస్టల్‌లో చదువుకుంటున్న సమయాన మా వార్డెన్‌ను చూసి ఉద్యోగం సాధించాలని అనుకున్నా. ఇప్పుడు జిల్లాలో వార్డెన్లను సమన్వయం చేసే బాధ్యతలు నిర్వర్తిస్తున్నా.. పాల్వంచ కేటీపీఎస్‌లో మా నాన్న ఇనుపనూరి సాయిల్ ఉద్యోగి. మా అమ్మ ముత్తమ్మ. అమ్మానాన్నలకు మేం ఎనిమిది సంతానం కాగా నేను ఐదో కుమార్తెను. అందరూ కుమార్తెలే కావడంతో నాన్న నన్ను కొడుకులా పెంచారు. కేటీపీఎస్ అభ్యుదయ పాఠశాలలో పదో తరగతి వరకు చదివా. అయితే, మూడో తరగతిలో సరిగా చదవడం లేదని టీచర్లు నాన్నకు చెప్పడంతో 4వ తరగతిలో పాల్వంచలోని హాస్టల్‌లో చేర్పించారు. అప్పుడు మా విద్యాబుద్ధులు పర్యవేక్షించే వార్డెన్‌ను చూసి నేనూ ఆ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. ఈ విషయాన్ని నాన్నకు కూడా చెప్పాను. ఐదో తరగతి తర్వాత మళ్లీ ఇంటికి తీసుకొచ్చారు. పాల్వంచలోనే ఇంటర్, డిగ్రీ చదివాను. 2002లో జూనియర్ అసిస్టెంట్‌గా భద్రాచలంలో ఉద్యోగం వచ్చింది. పదేళ్ల తర్వాత ఏఓగా పదోన్నతి లభించింది. 2023లో భద్రాద్రి జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించా. ఇప్పుడు శాఖ పరిధిలోని హాస్టళ్లను పర్యవేక్షిస్తున్నా. ఈ తరం విద్యార్థులు చిన్ననాటి నుంచి లక్ష్యాన్ని ఎంచుకుని శ్రద్ధతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరతారు. పదిహేనేళ్ల కష్టపడితే ఆతర్వాత జీవితం ప్రశాంతంగా సాగుతుందని గుర్తించాలి.

– ఇందిర, బీసీడబ్ల్యూఓ

పది కి.మీ. సైకిల్‌పై పయనం


చదువుకునే రోజుల్లో..


ప్రస్తుతం డీఎఫ్‌ఓగా..

పాల్వంచరూరల్: నిత్యం పది కి.మీ. మేర సైకిల్ తొక్కుతూ వెళ్లి చదువుకునేవాడిని. కామారెడ్డి మండలం మోషంపూర్‌కు చెందిన బొర్రగౌడ్ – బుచ్చమ్మ మా అమ్మానాన్నలు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మోషంపూర్‌లో, 8 నుంచి 10 వరకు చిన్నమల్లారెడ్డిలోని అమ్మమ్మ ఇంటి వద్ద, ఇంటర్, డిగ్రీ కామారెడ్డిలో చదివాను. అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నప్పుడు ప్రతిరోజు పది కి.మీ. సైకిల్‌పై పాఠశాలకు వెళ్లేవాడిని. స్నేహితులతో కలిసి సెలవుల్లో మాత్రమే ఆటకు వెళ్లేవాడిని తప్ప మిగతా రోజుల్లో చదువే లోకంగా ఉండేది. ఈత పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించా. చిన్నప్పుడు ఈత సరదాగా నేర్చుకోగా ఇప్పుడు ఉద్యోగుల క్రీడాపోటీల్లోనూ పతకాలు సాధించగలుగుతున్నా.

–జి.కృష్ణగౌడ్, అటవీశాఖాధికారి, భద్రాద్రి జిల్లా

మూడు కి.మీ. నడిస్తేనే చదువు


చిన్నతనంలో...


ఇప్పుడు సీఈగా..

పాల్వంచరూరల్: కష్టపడితే ఫలితం తప్పక వస్తుంది. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన బుచ్చిరాంరెడ్డి – వెంకటలక్ష్మికి నేను మూడో కుమారుడిని. ఇంటర్ వరకు స్వగ్రామం, కరీంనగర్‌లో చదివాక ఉన్నత విద్య హైదరాబాద్‌లో పూర్తిచేశా. చిన్నతనంలో స్కూల్‌కు వెళ్లడానికి మూడు కి.మీ. నడిచి వెళ్లేవాళ్లం. మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉండడంతో చదువును నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగడంతో ఈ స్థాయికి చేరా.

– ఎ.శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ సీఈ

నేడు, రేపు కంపెనీ లెవల్ కల్చరల్ మీట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఈ నెల 14,15 తేదీల్లో కంపెనీ లెవల్ కల్చరల్ మీట్ నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ఏరియా డీజీఎం పర్సనల్ శివకేశవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్చరల్ మీట్‌లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల నుంచి సుమారు 300 మంది కార్మికులు హాజరవుతారని వెల్లడించారు.

వర్షంతో తడిసిన ధాన్యం


కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

దమ్మపేట: దమ్మపేట మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి తడిసిపోయింది. మార్కెట్ కమిటీ సిబ్బంది పట్టాలు సరైన సమయంలో ఇవ్వని కారణంగా తమ ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోయారు. దీనిపై జీసీసీ మేనేజరు పాపారావును వివరణ కోరగా.. స్వల్పంగా తడిసినా ధాన్యం కొనుగోలు చేస్తామని, ఇక నుంచి టార్పాలిన్ పట్టాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

'అప్పారావుపేట' రికార్డు బ్రేక్

- అత్యధిక ఓఈఆర్ సాధించిన పామాయిల్ ఫ్యాక్టరీ
- ఇదే ఓఈఆర్‌పై పే పాలసీ నిర్ధారణ

అశ్వారావుపేట: తెలంగాణ ఆయిల్‌ఫెడ్ మరో మైలురాయిని చేరుకుంది. దమ్మపేట మండలం అప్పారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అత్యధిక ఓఈఆర్(ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో)ను సాధించి రికార్డు సృష్టించింది. ఫ్యాక్టరీ గత రికార్డు 19.11 ఓఈఆర్ ఉండగా 2023–24 ఆయిల్ ఇయర్‌లో అత్యధిక ఓఈఆర్ 19.42 సాధించింది. ఇందుకోసం రైతులు నాణ్యమైన గెలలను ఫ్యాక్టరీకి సకాలంలో సరఫరా చేయడం ప్రధాన కారణమైతే సిబ్బంది శ్రద్ధతో ఫ్యాక్టరీని నిర్వహించడం మరో కారణంగా చెప్పవచ్చు. కాగా గతేడాది ఎఫ్ఎఫ్‌బీ(గెలలు) ధర నిర్ణయించేందుకు ఓఈఆర్ 19.02 ఉండగా పేమెంట్ పాలసీ కోసం ఈ ఏడాది సరాసరి ఓఈఆర్‌ను తీసుకోవాలని రైతు సంఘ నాయకులు ఆయిల్‌ఫెడ్‌ను కోరారు. దీంతో జాతీయ ఆయిల్‌పాం ఫ్యాక్టరీల యజమాన్యాల సమాఖ్య ఆయిల్‌ఫెడ్‌కు దరఖాస్తు చేసుకుంది. బుధవారం ఆయిల్‌ఫెడ్ అధికారులు, రైతులు, సిబ్బందితో హైదరాబాదులో నిర్వహించిన సమావేశంలో అత్యధిక 19.42పైనే పాలసీ నిర్ధారించేందుకు అంగీకారం కుదిరింది. ఆయిల్‌ఫెడ్ ఆదాయంలో రైతుల వాటా 75.25 శాతం ఉండగా 14.61 శాతం పాలసీపై గెలల ధర చెల్లించాల్సి ఉంది. గతేడాది 14.42 ఉండగా ఈఏడాది 0.2శాతం పెరిగింది. దీంతో టన్ను గెలలకు గతేడాది కంటే రూ.200 అధికంగా చెల్లింపులు జరిగే అవకాశం ఉంది. దీంట్లో తెలంగాణ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ తీవ్ర కృషి చేసిందని అధ్యక్ష కార్యదర్శులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కోటగిరి సీతారామస్వామి 'సాక్షి'కి తెలిపారు. అత్యధిక ఆయిల్ రికవరీని పాలసీ నిర్ధారణ కోసం కృషి చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నర్సరీలలో మొక్కల నాణ్యత కోసం ఆయిల్‌ఫెడ్ పాటించే నియమాలను అన్ని నర్సరీలలో పాటించాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు విస్తరణకు ప్రస్తుత ధర దోహద పడుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, జాయింట్ డైరెక్టర్ సరోజిని, ఏడీహెచ్ లహరిలకు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కోటగిరి సీతారామస్వామి, బండి భాస్కర్, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


పామాయిల్ గెలల దిగుమతి పాయింట్ వద్ద హెల్మెట్లు ధరించి విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు

దమ్మపేట : పామాయిల్ ఫ్యాక్టరీలో కార్మికుల భద్రతకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. 'భద్రత చర్యలు కరువు' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించింది. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులందరికీ హెల్మెట్లను పంపిణీ చేసింది. విధిగా ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ వివరణ ఇస్తూ.. కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారితో ట్రాక్టర్లు నడిపించొద్దని లేబర్ కాంట్రాక్టు బాధ్యులకు సూచించామని చెప్పారు. కార్మికుల పనివేళల్లో షిఫ్టులను ఏర్పాటు చేశామని, త్వరలోనే హ్యాండ్ గ్లోవ్స్, పొడవాటి బూట్లు అందజేస్తామని, సెక్యూరిటీ వద్ద తనిఖీలకు బ్రీత్ ఎనలైజర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు.

భద్రగిరిలో మరో మూడు డిజిటల్ సేవలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో మరో మూడు డిజిటల్ సేవలను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఆలయ ఈఓ బి.రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఈఓలు అన్నదాన, ప్రొటోకాల్, వస్త్ర సమర్పణ విభాగాలను ఆన్‌లైన్ చేసినట్లు పేర్కొన్నారు. ఇలా డిజిటలైజేషన్ అమలు చేయడం తెలంగాణ దేవదాయ శాఖలో ఇక్కడే తొలిసారని చెప్పారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి

చర్ల/దుమ్ముగూడెం: ఆదివాసీ గిరిజన మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుకుని ఆర్థికంగా ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ జీఎం శంకర్‌రావు అన్నారు. బుధవారం దుమ్ముగూడెం మండలంలోని నందుల చలక, చర్ల మండలంలోని పెద్దిపల్లి ఇసుక ర్యాంపులను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మైనింగ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ మహిళలతో మాట్లాడారు. అధికారులు రాంబాబు, ప్రభాకర్ రావు, ఎల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్–3 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే పరీక్షలకు ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని 39 కేంద్రాల్లో 13,478 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలను ముందస్తుగా స్క్రీనింగ్ చేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులకు సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, ప్రతిసెంటర్‌లో ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎఎన్ఎంను అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొత్తగూడెం ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, పరీక్షల కోఆర్డినేటర్ హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు, పరీక్ష నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీగా ఉమామహేశ్వరరావు

పాల్వంచ: తెలంగాణా స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేటీపీఎస్ 5,6 దశల బ్రాంచ్ సెక్రటరీగా డి.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని 5,6 దశలు, 7వ దశ బ్రాంచ్‌ల ఎన్నికలు బుధవారం కోలాహలంగా జరిగాయి. 5,6 దశల బ్రాంచ్ సెక్రటరీ పోస్టుకు డి.ఉమామహేశ్వరరావు, జీఎస్ఆర్.భవానీ పోటీ పడగా, డి.ఉమామహేశ్వరరావు 78 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ఇసుక లారీ తనిఖీ

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి చర్ల నుంచి అశ్వారావుపేటకు ఇసుక తరలిస్తున్న లారీని ఆర్ఐ హచ్యా నిలిపి వేసి వే బిల్లులను తనిఖీలు చేశారు. ఉదయం 10 గంటల లోడు అయిన వాహనం సాయంత్రం ఆరుగంటల తర్వాత రావడంపై అనుమానంతో తనిఖీలు నిర్వహించినట్లు ఆర్ఐ తెలిపారు. అనంతరం లారీని వదిలిపెట్టారు.

బైక్ ఢీకొని యాచకుడి మృతి

మణుగూరు టౌన్: మండలంలోని తోగ్గూడెం మినీ మేడారం సమ్మక్క– సారలమ్మ ఆలయం వద్ద పినపాక మండలానికి చెందిన యాచకుడు మల్కం రామ్మోహన్(43) రోడ్డు దాటుతుండగా, జూలూరుపాడుకు చెందిన వజ్జా గోపి, అతని బంధువు కారం రామకృష్ణ బైక్‌పై వెళ్తూ ఢీకొట్టారు. దీంతముగ్గురికీ గాయాలు కాగా, పోలీసులు వచ్చి ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అప్పటికే రామ్మోహన్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా యువకులు మద్యం మత్తులో బైక్ నడిపి ప్రమాదానికి కారణమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుండాల: మండల పరిధిలోని కిచెనపల్లి గ్రామానికి చెందిన గొగ్గెల లక్ష్మీనారాయణ కొన్ని రోజులుగా మద్యానికి బానిసకావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి 108 వాహనంలో కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు.